క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

మేడ్చల్: కంటి సమస్యలున్న వారి కోసం మర్వాడీ యువ మంచ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 22వ వార్డులోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా వైద్యులు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యువమంచ్ వ్యాపారులు, బీఆర్ఎస్ నాయకుడు నరేందర్, కౌన్సిలర్ సాటే మాధవి తదితరులు పాల్గొన్నారు.

నూతన డ్రైనేజీ ప్రారంభం



కిష్టాపూర్‌లో ప్రారంభమైన డ్రైనేజీ పనులు

మేడ్చల్: పట్టణంలోని 4వ వార్డు కిష్టాపూర్‌లో నూతన డ్రైనేజీ నిర్మాణాన్ని కౌన్సిలర్ తుడుం గణేష్ ప్రారంభించారు. వార్డులో పురాతన డ్రైనేజీ కావడంతో మురుగు సాఫీగా వెళ్లక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాత డ్రైనేజీని పూర్తిగా తొలగించి నూతన డ్రైనేజీని నిర్మించారు. కౌన్సిలర్ గణేష్ పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. వార్డులో సంపూర్ణ డ్రైనేజీ, సీసీ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహ రెడ్డి వార్డుకు మరిన్ని నిధులు కేటాయించాలని ఆయన కోరారు.

ఎస్వీనగర్‌లో చలివేంద్రం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కౌన్సిలర్ కొకుట్ల మమతా కృష్ణారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీలోని ఎస్వీనగర్ మెయిన్‌రోడ్ వద్ద శ్రీసాయిగౌడ్ కన్వెన్షన్ హాల్ యజమాని ఎనిశెట్టి చంద్రమౌళి గుప్తా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని కౌన్సిలర్ కొకుట్ల మమతా కృష్ణారెడ్డి, కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వాహకులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు కొత్త గోపాల్‌రెడ్డి, పైళ్ల మల్లారెడ్డి, సారా బాల్‌రాజ్, సతీష్ రెడ్డి, భూపతి, నర్సింహారావు, ఏనుగు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



సంఘం నాయకులను సన్మానిస్తూ..

మేడ్చల్: రాష్ట్ర జనాభాలో అధికంగా ఉన్న మున్నూరు కాపు కులస్తులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని మండల మున్నూరు కాపు సంఘం నాయకుడు రాజు, కాచిగూడ మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ అన్నారు. గౌడవెల్లిలో నిర్వహించిన సంఘం సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సంఘం ప్రతిష్టకు అందరూ పని చేయాలన్నారు. అందరూ ఐక్యంగా ఉంటే తమ డిమాండ్లను సాధించుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వీరేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం



మేడ్చల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్‌లో విద్యార్థి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్‌యాదవ్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఎన్ఎస్‌యూఐ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ నాయకులు శ్రీధర్, సత్య, సాయినాథ్, భరత్, కౌశిక్, నవతేజ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మా పట్టణ బలగం

- ఒకే వేదికపైకి జవహర్‌నగర్ వాసులు
- అన్ని కులాలు, మతాల వారితో కలిసి.. మహనీయులను స్మరించుకునేందుకు..
- 14న భారీ ర్యాలీతో పాటు భారీ సభ

జవహర్‌నగర్: కుటుంబ కథా చిత్రం బలగం.. కొన్ని వారాలుగా ఎంతో మందిని ఆలోచింపజేస్తోంది. ఈ సినిమా ఒక కుటుంబాన్ని కలిపి ఎన్నో కుటుంబాల్లో చైతన్యం తీసుకొచ్చింది. అయితే.. ఊరంతా ఒకే వేదికపైకి తీసుకువచ్చే మహత్తర కార్యక్రమాన్ని జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ చేయనుంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కుల, ప్రజాసంఘాల, అన్ని పార్టీల నాయకులతో కలిసి ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని మహా ర్యాలీతో పాటు బహిరంగ సభను ఏర్పాటు చేసి ఎందరికో ఆదర్శం కానున్నారు. దేశంలోని మహనీయులు వారి జీవితకాలంలో పేద, బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన మహనీయుల జయంతి ఉత్సవాలను కుల, మత, ప్రాంత, వర్గ విభేదాలు లేకుండా, సామాజిక సమానత్వం, అణగారిన కులాల హక్కుల సాధన, మహిళలకు విద్యాహక్కు ఇలా ఎన్నో సామాజిక కార్యక్రమాలను చైతన్యపర్చిన ఎంతోమంది మహనీయులు పుట్టిన ఏప్రిల్ మాసాన్ని పవిత్ర మాసంగా పాటించాలని మహనీయుల కమిటీ తీర్మానం చేసింది.

అన్ని కులాలు ఏకతాటిపైకి..

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో మహనీయులను స్మరించుకునేందుకు ఏర్పాటైన మహనీయుల ఉత్సవ కమిటీలో హిందూ, ముస్లిం, క్రిష్టియన్, బుద్ధిజం, సిక్కులు విభిన్న మతాలు, 70కి పైగా కుల సంఘాలు, అగ్రవర్ణాలతో పాటు అణగారిన వర్గాలకు చెందిన వారంతా ఏకతాటిపైకి వచ్చి చరిత్ర సృష్టించనున్నారు.

కార్యాచరణ ప్రారంభం..

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ పేరుతో గతేడాది కేవలం 10 మంది మాత్రమే ఏర్పడి అందరినీ కలుపుకుని ఈనెల 14న భారీ ర్యాలీ నిర్వహించి సభను నిర్వహించారు. ఈ సంవత్సరం అన్ని కులాలతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా మండల సురేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అన్ని కులాలకు ప్రాధాన్యం కల్పిస్తూ ఉత్సవ కమిటీని పూర్తిస్థాయిలో ఏర్పాటు చేశారు. అందరినీ కలుపుకోవడంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, మీడియా ప్రతినిధులకు చోటు కల్పించారు. మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా వారిని అందరూ కలిసి స్మరించుకోవాలన్న ఏకైక ఎజెండాతో ముందుకు సాగుతున్నారు. జవహర్‌నగర్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో 14వ తేదీన బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ జయంతిని భారీ ఎత్తున చేయాలని నిర్ణయించారు. ఇందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే సర్వాయి పాపన్నగౌడ్, దొడ్డి కొమురయ్య, ఛత్రపతి శివాజీ, బాబు జగ్జీవన్‌రామ్‌ల కార్యక్రమాలను కలిసికట్టుగా నిర్వహించారు. ఈనెల 11న జ్యోతిరావు పూలే, 14వ తేదీన అందరు మహాత్ములను స్మరించుకునేందుకు భారీ సభ సిద్ధం చేస్తున్నారు.

దేశవ్యాప్తంగా చేయాల్సిన అవసరం ఉంది

మహనీయులు సమాజం కోసం వారి జీవితాలను త్యాగం చేశారు. ఏ ఒక్కరూ తమ కులాలు, మతాలకు ప్రతినిధులుగానో మత ప్రచారకులుగానో వారి జీవితాలను కొనసాగించలేదు. జాతి, మత కుల విభేదాలు లేకుండా అందరినీ కలుపుకుని ఆ మహాత్ములను వారి మహోన్నత త్యాగాలను గుర్తుచేసుకుంటూ స్మరించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



అన్ని కుల, ప్రజాసంఘాలతో ఏకమైన మహనీయుల ఉత్సవ కమిటీ



గతేడాది మహనీయుల ర్యాలీలో కులమతాలకు అతీతంగా సంబురాలు



అంబేడ్కర్ మహార్యాలీలో ఉత్సవ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు(ఫైల్)

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

శామీర్‌పేట్: గ్రామాభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మండలంలోని బాబాగూడ గ్రామ సర్పంచ్ లత రవి అన్నారు. గ్రామ ఉపసర్పంచ్ సింగిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్టర్‌ను ఆదివారం ప్రారంభించారు. గ్రామస్తులకు ఉచితంగా తాగునీరు అందించడం సంతోషంగా ఉందన్నారు. వార్డు సభ్యులు దయాకర్‌రెడ్డి, లావణ్య, కృష్ణారెడ్డి, కల్పన, సులోచన, మండల రైతు సంఘం మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

తండ్రి జ్ఞాపకార్థం చలివేంద్రం



చలివేంద్రం ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో కాంగ్రెస్ నేత శ్రీకాంత్‌రెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం ఆదివారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ హరివర్ధన్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సరిత, మున్సిపల్ కాంగ్రెస్ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంజీవరెడ్డి, వెంకటేశ్, సుసుశ్, దయానంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

అసమానతలు తొలిగిపోవాలంటే విద్యనభ్యసించాలి



ఘట్‌కేసర్‌లో మాట్లాడుతున్న వడ్డెర వెంకటేశ్

ఘట్‌కేసర్: ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదగాలన్నా కులమత అసమానతలు తొలగిపోవాలన్న బడుగులు విద్యనభ్యసించాలని వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు శివరాత్రి వెంకటేశ్ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగంతో స్వేచ్ఛా సమానత్వం సాధ్యమైందని, విద్యతో అంటరానితనం, కులవ్యవస్థ దూరం అవుతుందని అన్నారు. అనంతరం అంబేడ్కర్ చూపిన మార్గంలో నడవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, వడ్డెర సంఘం మండల, మున్సిపల్ అధ్యక్షులు నర్సింగ్‌రావు, మైసయ్య, సలహాదారుడు శ్రీను, మున్సిపల్ కార్యదర్శి మహంకాళి, ఆనంద్, దాస్, రాందాస్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో యేసు ఆరాధన

కీసర: రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవులకు దమ్మాయిగూడ మున్సిపాలిటీ అహ్మద్‌గూడలో కేటాయించిన స్థలంలోని సమాధుల తోటలో ఈస్టర్ ఆరాధనను ఆదివారం ఉదయం 6 నుంచి నిర్వహించారు. దమ్మాయిగూడ క్రిస్టియన్ సెల్ ఆధ్వర్యంలో డా.వీజేహెచ్ఎస్ నెల్సన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన కూడికకు అనేక మంది క్రైస్తవులు హాజరయ్యారు. కార్యక్రమంలో దమ్మాయిగూడ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు పి.హర్షవర్ధన్, కార్యదర్శి ఫిలప్ మాదాసు, పాస్టర్ పాల్ డేవిడ్, పాస్టర్ సతీష్ పాల్, గాబ్రియేల్, అహరోను తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: కొర్రెముల్ గ్రామానికి చెందిన బుచ్చమ్మ కుమారుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మంత్రి మల్లారెడ్డి ఆదివారం అందజేశారు. అనారోగ్యం కారణంగా బుచ్చమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందగా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేలు చెక్కును ఆమె కుమారుడికి మంత్రి క్యాంపు కార్యాలయంలో అందజేశాడు. బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు రవి, కొర్రెముల్ శాఖ అధ్యక్షుడు ఆనంద్, కీసరగుట్ట మాజీ డైరెక్టర్ మహేంద్రచారి, యూత్ మాజీ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కీసర: చీర్యాల చౌరస్తాలో తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. యాదాద్రి జిల్లా రాజాపేట్‌కు చెందిన వంశీ, సుమన్ పల్సర్ బైక్‌పై అంబేడ్కర్‌నగర్ నుంచి రాజాపేట్‌కు అతివేగంగా వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో వంశీ అక్కడికక్కడే మృతి చెందాడు. సుమన్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం అతడిని గాంధీ ఆసుపత్రిలో చేర్పించామని కీసర సీఐ రఘువీరారెడ్డి తెలిపారు.

మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 14వ తేదీన నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని జవహర్‌నగర్ మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డిని కలిసి ఆహ్వానం అందజేశారు. ఇందుకు మంత్రి మల్లారెడ్డి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు పరుశురాం, బూడిద వెంకటేష్, శ్రీనివాస్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి మల్లారెడ్డికి ఆహ్వానపత్రం అందజేస్తున్న మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు

పండితులకు నంది పురస్కార బిరుదులు



పండితులను సన్మానిస్తున్న చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పండితులను నంది పురస్కార బిరుదులతో కళా నిలయం సాంస్కృతిక సంస్థ, శిఖరం ఆర్ట్ థియేటర్స్ సంయుక్తంగా సత్కరించాయి. బ్రహ్మశ్రీ చిట్టిపెద్ది రామశర్మకు ప్రవచన భారతి, ఆర్.శివకార్తీక శర్మకు అలంకార సామ్రాట్, బి.శరణ కుమార శర్మకు వైదిక పురోహిత భాష్యం, ఎం.శరణ శర్మకు వైదిక పురోహిత రత్న బిరుదులు లభించాయి. ఈ సందర్భంగా నాగారం చైర్మన్ చంద్రారెడ్డి పండితులను పాత నాగారంలోని హనుమాన్ ఆలయంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్, కృష్ణారెడ్డి, దయాకర్‌రావు, అన్నంరాజు సురేష్, శ్రీకాంత్, నిమ్మల శీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి నియామకం చెల్లదు

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి



యువజన కాంగ్రెస్ నాయకులతో మండల నాయకులు

మేడ్చల్: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమితులైన నాగరాజు గౌడ్ నియామకం చెల్లదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి తెలిపారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామానికి చెందిన వెంకటేష్‌యాదవ్‌ను రాష్ట్ర కమిటీ యూత్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించిందని, అధిష్టానాన్ని కొంతమంది తప్పుదోవ పట్టించి మండలంలోని ఎల్లంపేట్ గ్రామానికి చెందిన నాగరాజును నియమిస్తున్నట్లు ఉత్తర్వులు వెల్లడించారని తెలిపారు. తాము మండల కమిటీ తరఫున విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్లగా నాగరాజు నియామకం చెల్లదని చెప్పారని తెలిపారు. కొంత మంది నాయకులు తమ స్వార్థం కోసం నాయకులను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

కీసర: క్రీడలతో శారీరకంగా దృఢంగా ఉండటంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. దమ్మాయిగూడలో మున్సిపాలిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శోభారాణికృష్ణారావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఆదివారం ఆయన ప్రారంభించారు. యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. యువత క్రీడల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ మహిళా కార్యదర్శి పద్మ, నాయకులు సంజీవరెడ్డి, సుమేశ్, సునీత, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి పలువురు బీఆర్ఎస్ నాయకులు




బీజేపీలో చేరిన ఇబ్రహీంపట్నం యువకులతో ఈటల రాజేందర్

మేడ్చల్‌రూరల్: పలు జిల్లాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు బీజేపీ చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సమక్షంలో బీజేపీలో చేరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంకు చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకులు, జనగాం జిల్లా స్టేషన్ ఘనాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం మేడ్చల్ మండలం పూడూర్ గ్రామ పరిధిలోని ఈటల నివాసానికి తరలిరాగా వారికి ఈటల రాజేందర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు సుభాష్, కార్తీక్‌రెడ్డి, కిశోర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి.. చిక్కులెన్నో..?

తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ బాధితుల ప్రదక్షిణలు

- రెండేళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలు బోలేడు..
- జిల్లాలో పేరుకుపోయిన దరఖాస్తులు 1100 పైనే..



సాక్షి, మేడ్చల్‌జిల్లా: భూదస్త్రాల ప్రక్షాళనే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్ గ్రామాల్లోని రైతులను అష్టకష్టాలకు గురిచేస్తోంది. మిస్సింగ్ సర్వే నంబర్లు, భూవిస్తీర్ణంలో తేడాలు, భూమి రకంలో తేడాలు, నిషేధిత జాబితా నుంచి తొలగించడం, పట్టా భూమి అసైన్డ్ భూములుగా నమోదవడం వంటి సమస్యలతో ప్రధానంగా అన్నదాతలకు చిక్కులు ఎదురవుతున్నాయి. పాత 1బీ దస్త్రాల్లోని భూముల వివరాలు కొత్త పాసుపుస్తకాల్లో తప్పుగా నమోదు కావడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. భూసమస్యల పరిష్కారానికి టీఎం–33 పేరున మాడ్యుల్‌ను ప్రభుత్వం తీసుకురావడంతో రైతులు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. పోర్టల్‌లో నమోదైన తమ సమస్యల పరిష్కారానికి పలువురు రైతులు దరఖాస్తు చేసుకోగా వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో, పాత రికార్డుల ఆధారంగా పరిష్కరిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నా.. జిల్లావ్యాప్తంగా సుమారు 1100 దరఖాస్తులు అపరిష్కృతంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ధరణిలో నమోదైన భూసమస్యల పరిష్కారానికి తక్షణం చొరవ చూపాలని బాధితులు కోరుతున్నారు.

ఆప్షన్ పని చేయక..

ప్రభుత్వం ఈ మధ్య టీఎం–33 (పాసు పుస్తకాల్లో డేటా కరెక్షన్) చేర్పులు, మార్పులు చేసేందుకు అవకాశం కల్పించింది. విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు వంటి సవరణకు రైతులు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే తహసీల్దార్ పరిశీలించి కలెక్టర్ లాగిన్‌కు నివేదిస్తే అన్ని విధాలా పరిశీలించి ఆమోదించాల్సి ఉంటుంది. ఈ ఆప్షన్ సరిగా పనిచేయనందున ఎక్కడి వేసిన గొంగలి అక్కడే అనే చందంగా మారింది. దీంతో దరఖాస్తుదారులకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. మీ సేవలో దరఖాస్తు చేసుకునేందుకు రూ.1,500 వరకు ఖర్చు అవుతోందని, అయినా పనికావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సవరణల కోసం తిప్పలు

ధరణి పోర్టల్ ప్రారంభ సమయంలో ఏర్పడ్డ లోపాలను సవరించే క్రమంలో భూలబ్ధిదారులకు తిప్పలు తప్పట్లేదు. కొందరు రెవెన్యూ అధికారులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుడటంతో ప్రభుత్వ భూమి జాబితాలో పట్టా భూములు, సర్వే నంబర్లలో లోపాలతో ఎన్నో ఏళ్లుగా ఉన్న భూములను అవసరానికి అమ్ముకోలేని దుస్థితి. గతంలో అమ్మిన వారి పేరుపైనే పట్టాపాసు పుస్తకాలు జారీ చేస్తుండటంతో.. కొనుగోలుదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ధరణి సమస్యల పరిష్కారానికి పలుమార్లు దరఖాస్తు చేసినా.. కుంటిసాకులతో అధికారులు తిరస్కరిస్తున్నట్లు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొర పెట్టుకున్నా.. పరిష్కారం లేదు

ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న మూడు ఎకరాల వ్యవసాయ భూమిలో 25 గుంటలు ధరణి పోర్టల్‌లో నమోదు కాలేదు. సరి చేయాలని మీ సేవా ద్వారా రెండుసార్లు దరఖాస్తు చేసుకుని రెండేళ్లుగా కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా.. ఇప్పటి వరకు సమస్య పరిష్కారం కాలేదు.

– ఏన్‌కే యాదవ్, యాప్రాల్

విక్రయించలేక పోతున్నాం

కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని కుందనపల్లిలో 30 మంది కలిసి ఇళ్ల స్థలాలు తీసుకున్నాం. గోధుమకుంటలో ఇదే సర్వే నంబర్‌తో ఉన్న వ్యవసాయ భూమి నిషేధిత జాబితాలో ఉండటంతో.. మా స్థలాలనూ అదే జాబితాలో చేర్చారు. దీంతో అమ్ముకోలేక పోతున్నాం.

– ఏంఎస్‌రావు, ఏఎస్‌రావు నగర్

పట్టా భూమి అసైన్డ్‌గా నమోదు

శివారులోని తన భూమిని ఆర్నెళ్ల క్రితం ఇతరులకు విక్రయించా. రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లగా అసైన్డ్ భూమిగా నమోదై ఉండటంతో రిజిస్ట్రేషన్ చేయడం వీలు కాదన్నారు. పట్టా భూమిగా మార్చేందుకు ఇప్పటికి మూడుసార్లు దరఖాస్తు చేసినా పరిష్కారం కాలేదు.

– రాంరెడ్డి, నాగోల్